సాక్షి
అన్నమయ్య జిల్లా

శుక్రవారం । 1 । మార్చి । 2024



ఉన్నత చదువులకు భరోసా

జగనన్న విద్యాదీవెన నిధులను మార్చి 1వ తేదీన కృష్ణా జిల్లా పామర్రులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి అకౌంట్లలో నగదు జమ చేయనున్నారు. -8లో



తగ్గిన రైల్వే చార్జీలు

కరోనా కాలంలో ప్యాసింజర్ రైళ్లలో కనీస చార్జి రూ.30 ఉండేది.కేంద్ర ప్రభుత్వం దీనిని రూ.10కి తగ్గించడంతో పేద ప్రయాణికులకు ఊరట లభించింది. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.110	రూ.140
రెండోరకం	రూ.66	రూ.98



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 180 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	369	415
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 1065.800 కిలోలు

న్యూస్‌రీల్

నేటినుంచి రాగిపిండి పంపిణీ

రాయచోటి అర్బన్: రేషన్ లబ్ధిదారులకు మార్చి 1వ తేదీనుంచి బియ్యం, సబ్సిడీ ధరపై చక్కెర, కందిపప్పు, గోదుమపిండితో పాటు రాగిపిండిని పంపిణీ చేయనున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహమ్మద్‌ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. బహిరంగ మార్కెట్‌లో కేజీ రూ.40గా ఉన్న రాగి పిండిని పౌరసరఫరాల శాఖ ద్వారా మార్చి నెల నుంచి కేజీ రూ. 11లకే అందచేయనున్నట్లు చెప్పారు. రాగిపిండిని తీసుకునే కార్డుదారులకు కేజీ బియ్యం తగ్గించి ఇస్తారని వివరించారు.జిల్లాలో ఉన్న సుమారు 5,06,920 కార్డుదారులకు 2024 మార్చి నెలకు సంబంధించి ఇప్పటికే 200 మెట్రిక్ టన్నుల రాగి పిండిని ప్రభుత్వం కేటాయించిందని తెలిపారు.

సాంకేతిక విద్యను అందిపుచ్చుకోవాలి



మాట్లాడుతున్న డీఈఓ శివప్రకాష్ రెడ్డి

రాయచోటి: విద్యార్థులు సాంకేతిక విద్యను అందిపుచ్చుకోవాలని, ఇందుకోసం ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి శివప్రకాష్ రెడ్డి అన్నారు. అలాగే విద్యార్థులు టోఫెల్ జూనియర్ పరీక్షలకు సన్నద్ధమయ్యేలా చేయాలని తెలిపారు. రాయచోటిలోని బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం సిబ్బంది, ఉపాధ్యాయులు సాంకేతిక నిపుణలతో సాంకేతిక విద్యపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. టోఫెల్ సమాచారాన్ని ఐఎఫ్‌లు, స్మార్ట్ టీవీలలో ఇన్‌స్టాల్ చేయబోతున్నట్లు డీఈఓ తెలిపారు. తద్వారా ఆరో తరగతి చదువుతున్న విద్యార్థులకు నాలుగేళ్ల పాటు శిక్షణను ఇస్తే 9వ తరగతిలో టోఫెల్ జూనియర్ పరీక్షలకు సిద్ధం అవుతారన్నారు. కార్యక్రమంలో రాష్ట్రస్థాయి టక్టోర్ టీమ్ సభ్యులు హరీష్ బాబు, జిల్లా నోడల్ అధికారి అశోక్ రెడ్డి, సమగ్ర శిక్ష ఏఎస్ఓ సుధాకర్‌లు పాల్గొన్నారు.


చెన్నరాయునిపల్లిలో రాష్ట్ర లోకాయుక్త



మాట్లాడుతున్న లోకాయుక్త జస్టిస్ పి.లక్ష్మణరెడ్డి

పెద్దతిప్పసముద్రం: రాష్ట్ర లోకాయుక్త, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ పి.లక్ష్మణరెడ్డి గురువారం టి.సదుం పంచాయతీలోని స్వగ్రామమైన చెన్నరాయునిపల్లికి విచ్చేశారు. సత్యసాయి జిల్లా కదిరి నుంచి రోడ్డు మార్గంలో పోలీస్ ఎస్కార్ట్ వాహనంలో విచ్చేసిన లోకాయుక్తకు తహశీల్దార్ శ్రీనివాసులు, డీటీ వెంకటరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ పి.శ్రీనాథ్‌రెడ్డి, ఏఎస్ఐ గోపాల్ నాయక్, వీఆర్వో ఖాదర్‌బాషాలు స్వాగతం పలికారు. మూడు రోజుల పాటు ఇక్కడ విడిది చేసిన అనంతరం మార్చి 3న చెన్నరాయునిపల్లి నుంచి మధ్యాహ్నం 3 గంటలకు రోడ్డు మార్గంలో బయలు దేరి అనంతపురం మీదుగా రాత్రి 8 గంటలకు కర్నూలుకు చేరుకుంటారని అధికారులు పేర్కొన్నారు.

అందరికీ ఆర్థిక అక్షరాస్యత అవసరం



విద్యార్థినులకు బహుమతులను అందచేస్తున్న వెంకటేశ్వరరెడ్డి

రాయచోటి అర్బన్: ప్రతి ఒక్కరికి చదువుతో పాటు ఆర్థిక అక్షరాస్యత అవసరమని లీడ్ బ్యాంక్ డిస్ట్రిక్ట్ మేనేజర్ వెంకటేశ్వరరెడ్డి అన్నారు. గురువారం ఉదయం పట్టణంలోని శ్రీషిరిడీసాయి మహిళా డిగ్రీకళాశాలలో ఆర్థిక అక్షరాస్యత పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆదేశాల మేరకు ఈ ఏడాది ఫిబ్రవరి 26 నుంచి మార్చి ఒకటో తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులకు చిన్నతనం నుండే పొదుపు చేయడం అలవాటు చేయాలన్నారు. వ్యక్తిగత సరదాలకు, షికార్లకు అప్పులు చేస్తే తర్వాత తిప్పలు పడాల్సి వస్తుందన్నారు. అనంతరం ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలలో భాగంగా కళాశాల విద్యార్థినులకు క్విజ్‌పోటీలను నిర్వహించి విజేతలకు బహు తులను అందచేశారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ వెంకట చలమారెడ్డి, డైరెక్టర్ మనోజ్ కుమార్‌రెడ్డి, కళాశాల సిబ్బందితో పాటు విద్యార్థినులు పాల్గొన్నారు.



సాగుకు ప్రోత్సాహం

- జిల్లాలో ప్రణాళికకు మించి అత్యధిక రుణాలు
- వ్యవసాయ రైతాంగానికి 2022–23లో రూ.8,819 కోట్లు
- 2023–24లో రూ.7,662 కోట్లు
- ఎంఎస్‌ఎంఈలకు రూ.2,403 కోట్లు
- ఇతర రుణాలు రూ.6,732 కోట్లు



బి.కొత్తకోట: కొత్తగా ఏర్పడిన అన్నమయ్యజిల్లా రైతాంగానికి, చిన్నతరహా పరిశ్రమల అభివృద్ధి, ఇతర రుణాల విషయంలో ప్రభుత్వం చూపిన చొరవ కారణంగా 2022 ఏప్రిల్ ఒకటి నుంచి 2023 డిసెంబర్ 31 నాటికి ఊహించని విధంగా బ్యాంకర్ల ద్వారా రూ.25,616 కోట్ల రుణాలు మంజూరయ్యాయి. ఇందులో వ్యవసాయ రంగానికి పెద్దపీట వేసిన ప్రభుత్వం మిగతా రంగాలకు ప్రాధాన్యత ఇచ్చింది. కొత్త జిల్లా అభివృద్ధికి ప్రభుత్వం బాటలు వేస్తోంది. లక్షల మంది రైతులకు విరివిగా రుణాలు అందిస్తూ సాగుకు ఢోకా లేకుండా.. ప్రైవేటు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించే అవకాశం లేకుండా ప్రభుత్వం చేస్తున్న కృషికి మంచి ఫలితాలు వస్తున్నాయి. 26 ప్రధాన బ్యాంకులకు చెందిన 231 బ్రాంచీలు జిల్లాలో ఉన్నాయి. వీటి ద్వారా రుణాలు అందిస్తున్నారు.

- జిల్లాలో వ్యవసాయ పంటల సాగుకు బ్యాంకర్లు అధిక ప్రాధాన్యత ఇచ్చాయి. ప్రభుత్వం నిర్దేశించిన రుణప్రణాళిక ప్రకారం బ్యాంకులు రైతులకు అండగా నిలిచాయి. 2022–23 ఆర్థిక సంవత్సరంలో ఖరీఫ్, రబీ రైతులకు రూ.5,302 కోట్ల రుణాలను మంజూరు చేయాలని నిర్ణయించగా అందుకు భిన్నంగా 5,06,024 మంది రైతులకు రూ.8,819 కోట్లు మంజూరు చేశారు. 2023–24లో డిసెంబర్ వరకు రూ.6,422 కోట్ల రుణాల లక్ష్యం అయితే రూ.7,662 కోట్ల రుణాలు అందించారు. ఈ రెండు సంవత్సరాల్లో సేద్యానికి రూ.11,724 కోట్ల రుణాలు ఇవ్వాలని నిర్ణయించగా ఏకంగా రూ.16,481 కోట్ల రుణాలు ఇచ్చారు. అంటే లక్ష్యానికి మించి రూ.4,757 కోట్ల రుణాలు అదనంగా చెల్లించడం రికార్డు.

పరిశ్రమలకు ప్రోత్సాహం

కొత్తగా ఏర్పడిన జిల్లాలో బ్యాంకర్లు ఔత్సాహిక చిరు పారిశ్రామికులకు తగిన ప్రోత్సాహం అందిస్తున్నాయి. 2022–23 డిసెంబర్ వరకు చిన్న చిన్న పరిశ్రమలు, కుటీర పరిశ్రమలు, వ్యక్తిగత వ్యాపారల నిమిత్తం లబ్ధిదారులకు రూ.2,403 కోట్ల రుణాలు అందించారు. రూ.2,076 కోట్ల రుణాలు ఇవ్వాలన్నది లక్ష్యంగా నిర్ణయించగా అదనంగా రూ.327 కోట్లు ఇచ్చారు. ఇవికాక వ్యక్తిగత రుణాల విషయంలోనూ ప్రాధాన్యత ఇస్తూ బ్యాంకులు ప్రజలకు చేరువయ్యాయి. 2022–23, 2023–24లో రూ.4,217 కోట్ల రుణాలు ఇవ్వాలని నిర్ణయించగా రూ.6,732 కోట్లు ఇచ్చారు. అంటే లక్ష్యానికి మించి రూ.2,515 కోట్లు అదనంగా మంజూరు చేశారు.

బ్యాంకర్ల సహకారం



పెద్దతిప్పసముద్రం మండలం తుమ్మరకుంట పంచాయతీ దిగవ బండమీదపల్లిలో రెండున్నర ఎకరాల వ్యవసాయ పొలం ఉంది. పంటలను సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాను. గత ఏడాది స్టేట్ బ్యాంకు రూ.90 వేల పంట రుణం మంజూరు చేయగా ఈ ఏడాది రుణాన్ని రూ.1.10 లక్షలకు పెంచి మంజూరు చేశారు. జగనన్న పాలనలో బ్యాంకర్లు రైతులకు సహకరిస్తున్నారు. రైతు భరోసా డబ్బులు కూడా జమ అవుతుండటంతో మాకు చాలా ఆనందంగా ఉంది. **–ఎస్.వెంకట్రమణ, రైతు, దిగవ బండమీదపల్లి**

ప్రభుత్వ లక్ష్యం నెరవేరేలా..



వ్యవసాయం, ప్రజలకు అందించే రుణాలు, ప్రోత్సాహాల విషయంలో ప్రభుత్వం ఏటా రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమావేశంలో లక్ష్యాలను నిర్దేశిస్తుంది. ఆ మేరకు జిల్లాలో రైతులు, పరిశ్రమలు, ప్రజలకు అందించాల్సిన రుణాలపై సిద్ధం చేసిన రుణ ప్రణాళికకు అనుగుణంగా బ్యాంకులు రుణాలు మంజూరు చేస్తున్నాయి. రుణాలపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ చర్యలు తీసుకుంటున్నాం. మార్చినాటికి రుణ విలువ ఇంకా పెరుగుతుంది. **–పి.వెంకటేశ్వరరెడ్డి, ఎల్‌డీఎం, రాయచోటి**

2022–23లో అందిన రుణాలు

- లక్ష్యం: రూ.5,302 కోట్లు
- మంజూరు: రూ.8,819 కోట్లు
- లబ్ధిపొందిన రైతులు: 5,06,024 మంది
- ఎంఎస్‌ఎంఈ రుణ లక్ష్యం: 1,293 కోట్లు
- మంజూరు: రూ.1,456 కోట్లు
- లబ్ధి: 44,203 మందికి
- ఇతరులకు రుణలక్ష్యం: 2,786 కోట్లు
- మంజూరు: 4,471 కోట్లు
- లబ్ధి: 1,42,425 మందికి

2023–24లో అందిన రుణాలు

- లక్ష్యం: రూ.6,422 కోట్లు
- మంజూరు: రూ.7,6662 కోట్లు
- లబ్ధిపొందిన రైతులు: 4,06,024 మంది
- ఎంఎస్‌ఎంఈ రుణ లక్ష్యం: 783 కోట్లు
- మంజూరు: రూ.947 కోట్లు
- లబ్ధి: 21,686 మందికి
- ఇతరులకు రుణలక్ష్యం: 1,431 కోట్లు
- మంజూరు: 2,261 కోట్లు
- లబ్ధి: 1,22,130 మందికి

(పై రుణాలు డిసెంబర్ నాటి వరకు)

ప్రభుత్వ పథకాలు అందాలంటే ఈకేవైసీ తప్పనిసరి



మాట్లాడుతున్న వ్యవసాయాధికారి చంద్రానాయక్

మదనపల్లె: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతుసంక్షేమానికి అమలుచేస్తున్న పంటబీమా, ఇన్‌పుట్ సబ్సిడీ, సున్నావడ్డీ పంటరుణాలు తదితర పథకాలన్నీ అందాలంటే రైతులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి చంద్రానాయక్ అన్నారు. గురువారం సాయంత్రం మదనపల్లె ఏడీ కార్యాలయంలో, వ్యవసాయ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. రబీ సీజన్‌కు సంబంధించి ఆర్‌బీకేల పరిధిలో జరిగిన పంటనమోదు, ఈకేవైసీ, సామాజిక తనిఖీ కోసం పంటనమోదు జాబితాల ప్రదర్శన, ఆర్‌బీకేల్లో ఎరువుల అమ్మకం తదితర అంశాలపై సిబ్బందితో సమీక్ష చేశారు. ఈ సందర్భంగా చంద్రానాయక్ మాట్లాడుతూ.. అన్నమయ్యజిల్లాలో రబీలో పంట వేసిన దాదాపు 2లక్షల 5వేల మంది రైతులకు సంబంధించి ఈ క్రాప్ బుకింగ్ 100శాతం, ఈకేవైసీ 99శాతం పూర్తయిందన్నారు. ఈకేవైసీ మిగిలిన ఒకశాతాన్ని గురువారం అర్ధరాత్రి వరకు యాప్ అందుబాటులో ఉన్నందున పూర్తి చేసేందుకు సిబ్బంది కృషిచేస్తారన్నారు. ఈ క్రాప్ బుకింగ్‌కు సంబంధించి సామాజిక తనిఖీలో భాగంగా మార్చి 1,2,3 తేదీల్లో జిల్లాలోని అన్ని ఆర్‌బీకేల్లో జాబితాలను ప్రదర్శిస్తామన్నారు. రైతులు తమ సమీప ఆర్‌బీకేల వెళ్లి.. తాము వేసిన పంట, విస్తీర్ణం, సర్వేనెంబర్‌కు సంబంధించి ఏవైనా తేడాలుంటే తక్షణమే..సంబంధిత ఆర్‌బీకే ఇన్‌చార్జ్‌కు దరఖాస్తు రూపంలో వినతిపత్రాన్ని అందజేస్తే...4,5 తేదీల్లో గ్రీవెన్స్‌లను పరిష్కరించి, 7వ తేదీన తుదిజాబితా ప్రచురిస్తామన్నారు. రైతులకు ప్రభుత్వ పథకాలకు సంబంధించిన లబ్ధి అందాలంటే ప్రతి ఒక్కరూ ఈకేవైసీ చేయించుకోవాలన్నారు.మదనపల్లె ఏడీలు నాగప్రసాద్, ఝాన్సీ, డివిజన్ పరిధిలోని వ్యవసాయాధికారులు, ఏఈఓలు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి తోడ్పాటు



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

తంబళ్లపల్లె: ఆలయాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో తోడ్పాటు ఇస్తోందని, ప్రతి ఒక్కరికి ఆధ్యాత్మిక చింతన, దైవభక్తితో మానసిక ప్రశాంతత,ఆరోగ్యం చేకూరుతుందని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని కన్నెమడుగు పంచాయతీలో పర్యటించారు. చిన్నమాచిరెడ్డిగారిపల్లెలో వెలసిన శ్రీఆవుదేవర దేవస్థానం వీరభద్రస్వామి ఆలయ పునఃనిర్మాణానికి భూమిపూజ చేశారు. సర్పంచ్ శ్యామలమ్మ, ఆమె కుమారుడు చిన్నబాబు దేవదాయశాఖ కమిషనర్ విశ్వనాథ్, ఈఓ రమణ, కన్నెమడుగు రెడ్డివారి దాయాదుల ఆధ్వర్యంలో వేదపండితులు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డిలకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంత్రి చేతుల మీదుగా భూమిపూజ జరిపి, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం గ్రామస్తుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.15లక్షలు జెడ్పీ నిధులు మంజూరు చేయాలని, 25 విద్యుత్ స్తంభాలను మంజూరు చేసేందుకు సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మల్లయ్యకొండ మాజీ చైర్మన్ కనుగొండ మద్దిరెడ్డి,రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ సురేంద్రనాథ్, ఒపీటీసీ సభ్యులు మహేష్, మల్లయ్యకొండ చైర్మన్ మల్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి,రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పోలీస్ యాక్ట్ అమలు

నందలూరు(రాజంపేట): రాజంపేట డీఎస్పీ ఉత్తర్వుల మేరకు నందలూరు మండల పరిధిలో ప్రస్తుత రాజకీయ పరిస్థితుల దృష్ట్యా, శాంతి భద్రతలను పరిరక్షించడానికి మార్చి 1వ తేదీ నుంచి 31 వరకు పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని నందలూరు ఎస్ఐ అబ్దుల్ జహీర్ తెలిపారు.అందువల్ల మండల పరిధిలో ర్యాలీలు, రాస్తాకోకోలు, ధర్నాలు, బంద్ వంటివి రాజంపేట డీఎస్పీ అనుమతి లేనిదే జరపవద్దని తెలిపారు.నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ పేర్కొన్నారు.

సీఎం వైఎస్ జగన్ చెప్పాడంటే..చేస్తాడంతే

- ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి
- పీలేరులో వందపడకల ఆసుపత్రి ప్రారంభం



వందపడకల ఆస్పత్రిని ప్రారంభిస్తున్న ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, కలెక్టర్ అభిషిక్త్ కిషోర్

పీలేరు : రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు హామీ ఇచ్చాడంటే.. వందశాతం అమలు చేస్తాడంతేనని రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం పీలేరు పట్టణంలో వందపడకల ప్రభుత్వాస్పత్రిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ పీలేరు ప్రజల చిరకాలవాంఛ వందపడకల ఆస్పత్రి ప్రారంభంతో నెరవేరినట్లైందని తెలిపారు. గత ప్రభుత్వాలు పీలేరు ఆసుపత్రిని 50 నుంచి వందపడకలు చేస్తామంటూ జీవోలు ఇవ్వడం అనంతరం మరచిపోయాయని చెప్పారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన నాలుగన్నరేళ్లలోనే తాము ఇచ్చిన హామీ మేరకు అన్ని హంగులతో పూర్తి స్థాయిలో వంద పడకల ఆస్పత్రి నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెచ్చామని వివరించారు. కోవిడ్‌ను దృష్టిలో పెట్టుకుని ఆక్సిజన్ నిల్వ కేంద్రాన్ని ఆస్పత్రిలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇకనుంచి మెరుగైన వైద్యం కోసం ప్రజలు దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. దేశంలో ఎక్కడాలేని విధంగా ఆరోగ్యశ్రీ ద్వారా 3 వేల పైచిలుకు వైద్యసేవలు ఉచితంగా అందించిన ఘనత ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో ఇంటి వద్దకే వైద్యసేవలు అందిస్తున్నట్లు తెలిపారు. పీలేరులో పేదలందరికీ ఇళ్ల కార్యక్రమంలో 12 వేలకు పైచిలుకు ఇళ్లు మంజూరుతోపాటు వారి పేరిట రిజిస్ట్రేషన్లు చేసినట్లు తెలిపారు. జగనన్న కాలనీల్లో ఇళ్లు కట్టుకోలేని పేదలకు తామే ఇళ్లు కట్టించి గృహ ప్రవేశాలు కూడా తామే చేపడుతామని హామీ ఇచ్చారు. గండికోట రిజర్వాయర్ నుంచి పైపులైన్ల ద్వారా పీలేరు, తంబళ్లపల్లె, మదనపల్లె, పుంగనూరు నియోజకవర్గాలకు తాగు, సాగునీరు తీసుకొస్తామన్నారు. ఇప్పటికే టెండర్లు ప్రక్రియ ముగిసి సర్వే జరుగుతున్నట్లు తెలిపారు. రెండు సంవత్సరాల్లో ప్రతి ఇంటికి కొళాయిల ద్వారా తాగునీరు ఇస్తామని చెప్పారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలు దాదాపు వందశాతం అమలు చేసినట్లు తెలిపారు. అదే చంద్రబాబు తన హయాంలో ఇచ్చిన హామీలు తుంగలో తొక్కి ప్రజలను మోసం చేశారన్నారు. డ్వాక్రా మహిళలను, రైతులను, నిరుద్యోగులను చంద్రబాబు మోసం చేయడం అందరికీ తెలిసిందేనన్నారు. గత ప్రభుత్వానికి, జగనన్న ప్రభుత్వానికి తేడా గమనించాలని తెలిపారు. మరోసారి జగనన్నను నిండు మనస్సుతో ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అభిషిక్త్‌కిషోర్, ఆర్డీవో రంగస్వామి, మాజీ ఎమ్మెల్యే శ్రీనాథరెడ్డి, రాష్ట్ర మైనారిటీ కమీషన్ ఛైర్మన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్, ఏపీఎండీసీ డైరెక్టర్ హరీష్‌రెడ్డి, నియోజకవర్గ పరిశీలకులు సహదేవరెడ్డి, ఎంపీపీ సతీష్‌రెడ్డి, జెడ్పీటీసీ రత్నశేఖర్‌రెడ్డి. సర్పంచ్ జీనత్‌షఫీ, ఏఎంసీ ఛైర్మన్ యల్లయ్య, నాయకులు పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి, రాకేష్‌రెడ్డి, హబీబ్‌బాషా, ఎస్.వి. చలపతి, హుమయూన్, నాగరాజమ్మ, మస్తాన్, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విద్య, వైద్యానికి పెద్దపీట: కలెక్టర్

విద్య, వైద్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ అన్నారు. గురువారం పీలేరు వందపడకల ఆస్పత్రి ప్రారంభోత్సవ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఏ ఒక్క పేదవాడు వైద్యం అందకుండా ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో ఉచిత వైద్యానికి అత్యధిక నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో ఆరు ఆస్పత్రులు వందపడకల ఆస్పత్రులుగా అప్‌గ్రేడ్ చేయడం జరిగిందన్నారు. జగనన్న కాలనీల్లో భాగంగా జిల్లాలో 60 వేల మంది లబ్ధిదారులు ఇళ్లు రిజిస్ట్రేషన్‌లకు అనుమతి లభించిందన్నారు. ఇప్పటి వరకు 35 వేల ఇళ్లు రిజిస్ట్రేషన్లు పూర్తి అయినట్లు తెలిపారు. ప్రజలు సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలన్నారు.

విద్యార్థీ.. విజయీభవ

- నేటి నుంచి ఇంటర్ పరీక్షలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- జిల్లాలో 54 పరీక్ష కేంద్రాల ఏర్పాటు



పరీక్ష కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఐఈవో కృష్ణయ్య తదితరులు

రాయచోటి: జిల్లాలో ఇంటర్‌మీడియట్ వార్షిక పరీక్షల నిర్వహణకు జిల్లా ఇంటర్ బోర్డు అధికారులు ఏర్పాట్లను పూర్తి చేశారు. జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ ఆదేశాల మేరకు పరీక్షల నిర్వహణను పకడ్బందీగా నిర్వహించేలా ఏర్పాట్లు చేపట్టినట్లు డీఐఈవో కృష్ణయ్య తెలిపారు.పరీక్ష కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు తీసుకెళ్లరాదని ఆదేశాలిచ్చారు. వేసవి తాపాన్ని దృష్టిలో ఉంచుకుని విద్యార్థులకు అవసరమైన తాగునీరు, ఆరోగ్య సమస్యలు తలెత్తితే ప్రాథమిక వైద్యంలో భాగంగా ప్రతి సెంటరు వద్ద ఒక ఏఎన్‌ఎంను, మందులను సిద్ధంగా ఉంచాలని సూచించారు. మార్చి నెల 1వ తేదీ నుంచి 19వ తేదీ వరకు ఇంటర్ ప్రథమ సంవత్సరం, 2 నుంచి 20వ తేదీ వరకు ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పరీక్షలు జరగుతాయన్నారు.ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు అరగంట(8.30) ముందుగానే కేంద్రానికి చేరుకోవాలని డీఐఈవో తెలిపారు.

54 సెంటర్లు.. 29877 మంది విద్యార్థులు

అన్నమయ్య జిల్లా పరిధిలో ఇంటర్ పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించేందుకు 54 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల్లో 29,877 మంది పరీక్షలకు హాజరు కానున్నారు. ప్రథమ సంవత్సరంలో 14821 మంది పరీక్ష రాయనుండగా అందులో 7011 మంది బాలురు, 7810 మంది బాలికలు ఉన్నారు. అలాగే ద్వితీయ సంవత్సరంలో 15056 మంది పరీక్షలు రాయనున్నారు. వీరిలో బాలురు 7339, బాలికలు 7717 మంది ఉన్నారు. పరీక్ష కేంద్రాలకు అవసరమైన ప్రశ్నపత్రాలు, ఇతర సామగ్రి నిల్వ కోసం 26 పోలీసు స్టేషన్లలో స్టోరేజి కేంద్రాలను ఏర్పాటు చేశారు.

- జిల్లాలో నిర్వహించనున్న ఇంటర్ పరీక్షలను 5 విభాగాలకు చెందిన అధికారులు పర్యవేక్షణ చేయనున్నారు. డీఐఈవో, ఫ్లయింగ్ స్క్వాడ్ ఇద్దరు, సిట్టింగ్ స్క్వాడ్ ఇద్దరు, స్పెషల్ ఆఫీసర్ ఒక్కరు, జిల్లా ఇంటర్ పరీక్షాకమిటీ పర్యవేక్షకులు ముగ్గరు వంతున పర్యవేక్షించనున్నారు. వీరితో పాటు 9 మంది కస్టోడియన్‌లు కూడా ఉన్నట్లు డీఐఈవో పేర్కొన్నారు.

ఉత్తీర్ణత శాతాన్ని పెంచేలా...

విద్యార్థులు ఎలాంటి ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా పరీక్షలను రాసి మంచి ఉత్తీర్ణత శాతాన్ని పెంచాలని విద్యార్థులకు డీఐఈవో కృష్ణయ్య సూచించారు. ఫీజులు చెల్లించలేదని కొంతమంది ప్రైవేటు స్కూల్స్ యాజమాన్యం హాల్ టిక్కెట్లను ఇవ్వకపోతే నెట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకుని పరీక్షలకు హాజరు కావాలన్నారు.

ఏర్పాట్ల పరిశీలన

శుక్రవారం ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షకు సంబంధించిన ఏర్పాట్లను డీఐఈవో కృష్ణయ్య పరిశీలించారు.గదులను తనిఖీ చేశారు. సౌకర్యాల గురించి ఆరా తీశారు.విద్యార్థులు కుర్చోవడానికి నంబర్లు వేస్తున్న విధానాన్ని ఆయన దగ్గరుండి పరిశీలించారు.

వీరభద్రుడి బ్రహోత్మవ ఏర్పాట్ల పరిశీలన



ఆలయ మాడవీధులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్, ఆలయం ఈఓలు

రాయచోటి అర్బన్: మహాశివరాత్రిని పురస్కరించుకుని మార్చి 5 నుంచి 15వ తేదీ వరకు జరిగే రాయచోటి వీరభద్రుడి బ్రహ్మోత్సవ ఏర్పాట్లను మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, ఆలయ కార్యనిర్వహణ కార్యదర్శి రమణారెడ్డితో కలసి గురువారం ఎపరిశీలించారు. ఆలయం మాడవీధులు, స్వామివారం రథం తిరిగే వీధులను పరిశీలించారు. స్వామి వారి రథం తిరిగే రోడ్లపై చిన్న చిన్న గుంతలకు మరమ్మతులు చేయాలని మున్సిపల్ డీఈ సుధాకర్‌నాయక్‌ను వారు ఆదేశించారు. ఇతర రాష్ట్రాల నుండి వేలసంఖ్యలో భక్తులు హాజరవుతున్న నేపథ్యంలో ప్రజారోగ్యం దృష్ట్యా ప్రత్యేక శానిటేషన్ టీంలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. త్వరలో జిల్లా కలెక్టర్ నేతృత్వంలో అన్ని శాఖలతో సమన్వయ సమావేశం నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ క్రిష్టారెడ్డి, ఆర్ఐ మల్లిఖార్జున పాల్గొన్నారు.

క్లుప్తంగా

అనుమానాస్పద స్థితిలో చిన్నారి మృతి


మృతి చెందిన నందిని

చిన్నమండెం : మండల పరిధిలోని కేశాపురం గ్రామ కస్పాకు చెందిన వీరయ్య, ప్రాణేశ్వరిల కుమార్తె నందిని(4) అనే చిన్నారి అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. వారి కథనం మేరకు.. స్వగృహంలోని ఇంటి ముందు చిన్నారి అనుమానాస్పదంగా ఉరేసుకున్న రీతిలో మృతిచెంది ఉందన్నారు. చిన్నారి తల్లి ప్రాణేశ్వరి వలంటీర్‌గా పనిచేస్తుండగా భర్త వీరయ్య వ్యవసాయ పనులు చేస్తుండేవారన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

దొంగతనం కేసులో ఐదుగురికి జైలు శిక్ష

సంబేపల్లె : మండల పరిధిలోని శెట్టిపల్లి గ్రామం, కొత్తపల్లి బిడికి నాగరప్పమ్మ గుడిలో పది నెలల క్రితం జరిగిన చోరీ కేసులో ఐదుగురు ముద్దాయిలకు ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ గురువారం తీర్పు వెలువరించారు. పోలీసుల వివరాల మేరకు.. 2023, ఏప్రిల్ నెల 4వ తేదీ దొంగతనం కేసులో కోడూరు చిన్న, పి.శ్రీను, సి నాగరాజు, ఎన్.పెంచలయ్య, కె.గంగయ్యలపై అప్పట్లో కేసు నమోదైంది. విచారణ అనంతరం రాయచోటి పబ్లిక్ జూనియర్ సివిల్ జడ్జి న్యాయమూర్తి మహమ్మద్ ఇషారత్ ఫాతిమా ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారు. దోపిడీలకు, దొంగతనాలకు పాల్పడితే శిక్ష తప్పదని ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

గడ్డివామి దగ్ధం

బి.కొత్తకోట : పొలంలో కొంగల బెడదను నివారించేందుకు ఓ రైతు టపాకాయలు కాల్చగా వాటి నిప్పురవ్వలు పడి గడ్డివామి దగ్ధమైంది. మండలంలోని శీలంవారిపల్లె పంచాయతీ గుంతావారిపల్లెకు చెందిన వై.వెంకటరమణ గడ్డివామిపై నిప్పురవ్వలు పడి పూర్తిగా కాలిపోయింది. ప్రమాదం కారణంగా రూ.15వేలు నష్టం వాటిల్లింది.

తగ్గిన రైల్వే చార్జీలు

- కరోనా కాలంలో కనీస చార్జి రూ.30
- ప్రస్తుతం రూ.10కి దిగివచ్చిన రైల్వేశాఖ
- పేదోళ్ల రైలు ప్రయాణం ఇక సులభతరం
- మూడు ప్యాసింజర్ రైళ్లకు వర్తింపు

ప్యాసింజర్ రైళ్లు

హుబ్లీ – తిరుపతి	ప్యాసింజర్
నంద్యాల – రేణిగుంట	డెమో
కడప – అరక్కోణం	ప్యాసింజరు


నంద్యాల-రేణిగుంట మధ్య నడిచే డెమో ప్యాసింజర్

రాజంపేట : దేశంలో మొదటిసారి కరోనా విజృంభించిన సమయంలో రైల్వేశాఖ ప్రజారవాణా విషయంలో నిబంధనలు కఠినతరం చేసింది. ప్రత్యేక రైళ్లను నడిపించిన క్రమంలో ప్యాసింజర్ రైళ్ల టికెట్ ధరలు పెంచింది. ఇప్పుడు ఆ ధరలను రద్దు చేసింది. దీంతో పేదవాడి ప్రయాణానికి ఊరట లభించింది.

ప్యాసింజర్ రైళ్లు ఇవే..

ఉమ్మడి వైఎస్సార్ జిల్లా రైలుమార్గంలో తిరుపతి-హుబ్లీ మధ్య నడిచే ఇంటర్‌సిటీప్యాసింజరు, కడప-అరకోణం మధ్య నడిచే ప్యాసింజరు, నంద్యాల-రేణిగుంట మధ్య నడిచే డెమో ప్యాసింజర్లలో పేదవాడి రైలుప్రయాణం తక్కువ ధరలో ఉంటుంది. ఇప్పటి వరకు ఈ రైళ్లలో ప్రయాణంలో కనీస చార్జి రూ.30కి పెంచిన సంగతి తెలిసిందే.

రూ.30టికెట్ ధర ఇకపై రూ.10కే

ప్యాసింజర్, పుష్‌పుల్ రైలు ప్రయాణికులకు శుభవార్త. ఈ రైళ్లలో ప్రయాణించే కనీస చార్జీని రూ.10కి తగ్గించారు. ఈమేరకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. గతనెల 27 నుంచి అమలులోకి తీసుకొచ్చింది. కరోనా కాలంలో సదరు చార్జీని రూ.30కి పెంచారు. రైల్వేశాఖ తాజా నిర్ణయంతో లక్షలాది మంది పేద ప్రయాణికులపై భారం తగ్గనుంది. కనీసచార్జిని భారతీయ రైల్వేకి సంబంధించి క్రిస్‌లో ఫీడింగ్ చేశారు.

కడప నుంచి రైల్వే చార్జీల వివరాలు

స్టేషన్	స్టేషన్	కొత్తచార్జి(రూ)
కడప	తిరుపతి	30
కడప	రేణిగుంట	30
కడప	కోడూరు	25
కడప	రాజంపేట	15
కడప	నందలూరు	10
కడప	కమలాపురం	10
కడప	ఎర్రగుంట్ల	10
కడప	కొండాపురం	25
కడప	గుత్తి	35
కడప	గుంతకల్	40
కడప	బళ్లారి	50
కడప	హోస్పేట్	65
కడప	హుబ్లీ	85
కడప	ప్రొద్దుటూరు	15
కడప	జమ్మలమడుగు	20
కడప	నంద్యాల	45
కడప	అరక్కోణం	45
కడప	తాడిపత్రి	25

కరోనా నాటి చార్జీలు తగ్గించడం సంతోషం



కరోనా కాలం ప్యాసింజర్ రైళ్లలో కనీస చార్జి రూ.30 ఉండేది. ఫలితంగా పేదవాడి ప్రయాణం భారంగా మారింది. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం కరోనా కాలం నాటి చార్జీని రూ.10కి తగ్గించడంతో పేద ప్రయాణికులకు ఊరట లభించింది. జిల్లా మీదుగా మరికొన్ని ప్యాసింజర్ రైళ్లను తీసుకురావాలి

– షేక్ జావిద్, కూరగాయల వ్యాపారి

కనీస చార్జిని రూ.10 చేయడం ఊరట



కరోనా కాలంలో తీసుకొచ్చిన కనీస చార్జీని తగ్గించారు. జిల్లామీదుగా ఉన్న మూడు ప్యాసింజర్ రైళ్లలో కనీస చార్జి రూ.10కి పెట్టడం శుభపరిణామం. పేద, మధ్యతరగతి ప్రయాణాలు అధికంగా జరిగే అవకాశాలు ఉంటాయి. రైల్వేశాఖ పేదల ప్రయాణాన్ని దృష్టిలో ఉంచుకొని ప్యాసింజర్ రైళ్ల సంఖ్యను పెంచాలి.

– పొన్నాల చలపతి గౌడ్, అరటికాయలవ్యాపారి



వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. నెలల తరబడి ఆఫీసుల చుట్టూ తిరిగినా లభించని సర్టిఫికెట్లు నేడు జగనన్న సురక్ష ద్వారా సత్వరమే అందుతున్నాయి. దయనీయ స్థితిలో ఉన్న సర్కారు బడుల రూపురేఖలు నాడు-నేడుతో ఇప్పుడు పూర్తిగా మారిపోయాయి. సొంతంగా సెంటు స్థలం కొనే స్థోమత లేక.. అద్దె చెల్లించలేక అవస్థలు పడుతున్న పేదల సొంతింటి కల సాకారమవుతోంది. వెరసి పేదల బతుకులు బాగుపడ్డాయని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

–సాక్షి నెట్‌వర్క్

ఇంటి వద్దకే ధ్రువీకరణ పత్రాలు



ఒక్క రూపాయి ఖర్చు లేకుండా ఇంటి వద్దకే మా పిల్లలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు వచ్చాయి. గతంలో ధ్రువీకరణ పత్రాలు కావాలంటే మండల కేంద్రానికి వెళ్లి దరఖాస్తు చేసుకోవాల్సి ఉండేది. అవి ఎప్పుడు వస్తాయో కూడా తెలియని పరిస్థితి. ఇటీవల నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అవసరమైన ధ్రువీకరణ పత్రాలన్నీ సచివాలయం ద్వారానే వస్తాయని వలంటీర్ ప్రవీణ్ చెప్పడంతో కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేసుకున్నాము. రెండు రోజుల వ్యవధిలోనే దరఖాస్తు చేసుకున్న ధ్రువీకరణ పత్రాలన్నీ ఉచితంగానే అందజేశారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలన్నీ కూడా వలంటీర్ ద్వారా ఇంటి వద్దకే అందిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మేము ఎప్పటికీ రుణపడి ఉంటాము.

– ఏనుగువెంగమ్మ, కాలువపల్లె, గోపవరం మండలం

పాఠశాలకు కొత్త హంగులు



నాడు-నేడుతో మా పాఠశాలకు కొత్త హంగులు వచ్చాయి. కార్పొరేట్ పాఠశాలకు దీటుగా ఇంగ్లీషు మీడియంలో బోధిస్తున్నాం. విద్యార్థులకు సకాలంలో పాఠ్య పుస్తకాలతో పాటు జగనన్న విద్యాకానుక ఇచ్చాము. పిల్లలకు జగనన్న గోరుముద్దతో పౌష్టికాహారం అందుతోంది. గతంలో కంటే ప్రస్తుతం పాఠశాల బాగుపడింది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చలవ వల్లే విద్యాశాఖకు మహర్దశ పట్టింది.

– షరాఫత్‌అలీఖాన్, స్కూల్ అసిస్టెంట్, బాలాజీనగర్ ఉర్దూ ఉన్నత పాఠశాల, మదనపల్లె.

ప్రజా సేవకుడిగా గుర్తింపు పోలీసులకే సాధ్యం

పదవీ విరమణ సభలో ఎస్పీ కృష్ణారావు


పదవీ విరమణ పొందిన వారిని సన్మానిస్తున్న ఎస్పీ కృష్ణారావు

రాయచోటి : ప్రజలతో దగ్గరగా ఉంటూ ప్రజాసేవలో గుర్తింపు పొందడం ఒక్క పోలీస్‌కే సాధ్యమని అన్నమయ్య జిల్లా ఎస్పీ కృష్ణారావు అన్నారు. గురువారం సాయంత్రం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో పదవీ విరమణ పొందిన సిబ్బందిని జిల్లా ఎస్పీ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రపంచంలో కొన్ని వందల వృత్తులు ఉన్నాయని, అన్నిటికన్నా ముందుండి ప్రజాసేవ చేయడంలో ప్రజలకు దగ్గరగా ఉండేది ఒక పోలీస్ ఉద్యోగం మాత్రమే అన్నారు. అమ్మానాన్నలు తాము నడిచే వరకు తమ ఒడిలో పెట్టుకొని పెంచి పోషించారు. పోలీస్ ఉద్యోగానికి వచ్చిన తరువాత పోలీసు డిపార్ట్‌మెంట్ సుమారు 30–40 సంవత్సరాలు గౌరవప్రదంగా తన ఒడిలో పెట్టుకొని ఒక మంచి మార్గాన్ని, ఒక మంచి కుటుంబాన్ని ఇచ్చి పోషించిందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో పదవీ విరమణ పొందడం ప్రతి ఒక్కరికీ బాధను కలిగిస్తోందన్నారు. పోలీస్ ఉద్యోగాన్ని ప్రతి క్షణం ఒక ఛాలెంజ్‌గా తీసుకొని, ఈ పోలీస్ వ్యవస్థకు సేవలు అందించిన మీకు పోలీస్ డిపార్ట్‌మెంట్ తప్పకుండా రుణపడి ఉంటుందన్నారు. పదవీ విరమణ పొందిన వారిలో ఏఆర్ ఎస్ఐ పి.వెంకటసుబ్బయ్య(బాబు), హెచ్‌జి 48 యు.రమేష్ ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ బి.చిన్నికృష్ణ, ఆర్ఐ (అడ్మిన్) ఎస్.శ్రీనివాసులు, ఎంటీఓ పెద్దయ్య, ఆర్ఎస్ఐలు నటరాజ్, సోమశేఖర్, చంద్రశేఖర్‌లు రాయచోటి/రాజంపేట సబ్ డివిజన్ హోంగార్డ్స్ ఇన్‌చార్జిలు, పదవీవిరమణ పొందిన వారి కుటుంబసభ్యులు, పోలీసు సిబ్బంది, హోంగార్డులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కో కన్వీనర్ మృతి


భరత్ కుమార్ రెడ్డి (ఫైల్)

గాలివీడు : అన్నమయ్య జిల్లా వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కోకన్వీనర్ మలసాని భరత్‌కుమార్‌రెడ్డి (27) గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. రాయచోటి నుంచి గాలివీడుకు తన స్నేహితులతో ద్విచక్రవాహనంలో వస్తుండగా మార్గమధ్యంలోని యండపల్లె వద్ద ఎదురుగా వెళ్తున్న ట్రాక్టర్ ట్యాలీని ఢీ కొన్నాడు. వెంటనే రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు స్నేహితులు తెలిపారు. ఈయన మృతి పట్ల ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ నాయకులు, సోషల్ మీడియా సభ్యులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతదేహానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు. మృతుడి కుటుంబ సభ్యులకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ మేరకు రాయచోటి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని మృతుడి స్వగ్రామమైన అరవీడుకు తరలించడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

పార్టీ సైనికుడిని కోల్పోయాం

– కంటతడి పెట్టిన ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి


విషణ్ణ వదనంతో ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి

రాయచోటి : రోడ్డు ప్రమాదంలో మలసాని భరత్ కుమార్ రెడ్డి మృతితో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మంచి సైనికుడిని కోల్పోయిందని ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి కంటతడి పెట్టారు. రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రిలో భరత్ మృతదేహాన్ని ఎమ్మెల్యే సందర్శించి నివాళులు అర్పించారు. మృతదేహాన్ని చూసిన వెంటనే శ్రీకాంత్ రెడ్డి దిగ్భ్రాంతికి గురయ్యారు. పార్టీకి ఎంతో సేవ చేశారని, మంచి సైనికుడిని కోల్పోయామని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. భరత్ తల్లిదండ్రులను, సోదరుడు అనిల్ రెడ్డి, వారి కుటుంబ సభ్యులను శ్రీకాంత్ రెడ్డి ఓదార్చారు. పోలీస్, వైద్యాధికారులతో చేపట్టాల్సిన చర్యలపై శ్రీకాంత్ రెడ్డి ఆసుపత్రి దగ్గరే ఉండి మాట్లాడారు.

సారా విక్రయిస్తున్న మహిళ అరెస్టు

మదనపల్లె : వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జన్మభూమి కాలనీలో బాణావత్ సంపూర్ణమ్మ (37) సారా విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకున్నట్లు వన్ టౌన్ సీఐ వలీబాషు తెలిపారు.తెలిపారు. ఆమె వద్ద నుంచి పది లీటర్ల సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

కలికిరిలో..: ఏఎస్ఆర్ కాలనీ, బండకాడపల్లె ప్రాంతాల్లో నాటుసారా విక్రయిస్తున్నట్లు అందిన సమాచారంతో ఏఎస్ఐ మాబూసాహెబ్ ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించారు. బండకాడపల్లెకు చెందిన శ్రీనివాసులు పది లీటర్ల సారా కలిగి ఉండగా అరెస్ట్ చేసినట్లు సీఐ ఆర్. మోహన్ తెలిపారు.

గొంతు కోసుకుని ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : అనారోగ్యం భరించలేక ఓ వ్యక్తి గొంతు కోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన గురువారం మదనపల్లెలో జరిగింది. సత్యసాయి జిల్లా కదిరి నియోజకవర్గ పరిధిలోని తలపుల గ్రామానికి చెందిన షేక్ దస్తగిరి(52), వ్యాపార రీత్యా మదనపల్లిలో ఉంటున్నాడు. స్థానిక బెంగళూరు బస్టాండ్‌లో తోపుడు బండిపై వ్యాపారం చేస్తూ జీవిస్తున్నాడు. అయితే గత కొంతకాలంగా అతను కడుపునొప్పి కారణంగా ఇబ్బంది పడుతున్నాడు. పలుచోట్ల చికిత్స చేయించుకున్నాడు. అయినా గురువారం మరోసారి అనారోగ్యం తిరగబెట్టి కడుపునొప్పి అధికం కావడంతో భరించలేక గొంతు కోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు వెంటనే స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

బైక్ పై నుంచి పడి తీవ్ర గాయాలు

మదనపల్లె : బైక్ పైనుంచి అదుపుతప్పి వివాహిత కిందపడి తీవ్రంగా గాయపడిన సంఘటన గురువారం గుర్రంకొండ మండలంలో జరిగింది. రాయచోటి మాసాపేటకు చెందిన భార్యాభర్తలు సురేష్, శ్రీకన్య ద్విచక్ర వాహనంలో గుర్రంకొండలోని అత్తవారింటికి బయలుదేరారు. మార్గమధ్యంలోని చెర్లోపల్లె సమీపంలో స్పీడ్ బ్రేకర్ వద్ద బైక్‌లో వెనక కూర్చున్న శ్రీ కన్య అదుపుతప్పి కిందపడి తీవ్రంగా గాయపడింది. గమనించిన స్థానికులు బాధితురాలిని మదనపల్లి ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంలో తలకు తీవ్ర గాయం కావడంతో మెరుగైన వైద్యం కోసం ఆమెను తిరుపతికి రెఫర్ చేశారు. గుర్రంకొండ పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

భార్యను చంపిన భర్త అరెస్టు

ఒంటిమిట్ట : ఒంటిమిట్టలో గత నెల 21వ తేదీన అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన మహిళ కేసును గురువారం ఒంటిమిట్ట పోలీసులు ఛేదించారు. సీఐ పురుషోత్తం రాజు తెలిపిన వివరాల మేరకు ఒంటిమిట్టలోని గంగమ్మ గుడి వద్ద నివాసం ఉంటున్న సుంకు సుహాసిని (46), ఆమె భర్త సుబ్బారావు మొబైల్ క్యాంటీన్ వ్యాపారం నిర్వహించేవారు. భార్యా భర్తలు ఆరోజు రాత్రి గొడవపడ్డారు. కోపోద్రిక్తుడైన సుబ్బారావు భార్య సుహాసినిని గట్టిగా తోయడంతో ఆమె తలకు బలమైన రక్తగాయమై మృతి చెందింది. దీంతో సుబ్బారావు అనుమానం రాకుండా మృతదేహాన్ని పెట్రోల్ పోసి దహనం చేశాడు. తమ విచారణలో నిందితుడు నేరం ఒప్పుకోవడంతో అతనిని రిమాండ్‌కు తరలించామని సీఐ వివరించారు.

జగన్‌తోనే రాష్ట్ర ప్రగతి


వైఎస్సార్‌సీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎంపీ మిథున్ రెడ్డి

వాల్మీకిపురం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితోనే రాష్ట్ర ప్రగతి, అభివృద్ధి సాధ్యమని రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని జర్రావారిపల్లికి చెందిన రంగనాథ, శివ, లక్ష్మినారాయణ, గంగరాజు, అశోక్, హరి, వెంకటరమణ, తదితరులు గురువారం గండబోయనపల్లిలోని ఏపీఎండీసీ డైరెక్టర్ హరీష్ రెడ్డి అతిథి గృహంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, ఏపీఎండీసీ డైరెక్టర్ హరీష్ రెడ్డి సమక్షంలో 10 కుటుంబాలు టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరికి ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి వైఎస్సార్‌సీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయినప్పటి నుంచి నవరత్నాల ద్వారా ప్రజలకు నేరుగా పథకాలను వారి ఖాతాల్లో జమ చేస్తూ.. ఆర్థికంగా బలోపేతం చేస్తున్నారన్నారు. కులమతాలు, రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

30 కుటుంబాలు చేరిక


వైఎస్సార్‌సీపీ కండువా వేసి ఆహ్వానిస్తున్న నాగభూషన్‌రెడ్డి

రామాపురం : అయోధ్యపురం నాగభూషన్‌రెడ్డి ఆధ్వర్యంలో 30 కుటుంబాల వారు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి సమక్షంలో గురువారం పార్టీలో చేరిన వారిలో సరస్వతిపల్లె గ్రామస్తులు పెంచలయ్య, టైలర్ రమణ, అబ్బవరం రమణ, ఆదినారాయణ, విశ్వనాథ్, శంకర, వెంకటరమణ, రాజకుమార్, సదాశివ, కృష్ణ, రమణయ్య, చంద్ర, సురేంద్ర, తదితరులు ఉన్నారు. వీరితో పాటు అయోధ్యాపురం పెద్దిరెడ్డి, సుకుమార్‌రెడ్డి, ద్వారకనాథరెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసులో ఇద్దరి అరెస్టు


నిందితుల అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ

రాజంపేట : రాజంపేట పరిసర ప్రాంతాల్లో చోరీలకు పాల్పడిన కేసులలో ధర్మవరం పట్టణం కేతిరెడ్డి కాలనీకి చెందిన ఎం.రామాంజినేయులు, సత్యసాయి జిల్లా కదిరి మండలం బీపట్నంకు చెందిన యనమల ఆంజనేయులును అరెస్టు చేసినట్లు డీఎస్పీ చైతన్య తెలిపారు. స్థానిక అర్బన్ పోలీసు స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముద్దనూరు పోలీసు స్టేషన్ పరిధిలో దొంగతనాలకు పాల్పడిన వీరు రాజంపేట మండలం కూచివారిపల్లెలో పట్టపగలే దొంగతనాలకు పాల్పడ్డారన్నారు. దోచుకున్న బంగారు నగలను యనమల ఆంజనేయులు ద్వారా మణప్పురంగోల్డ్, ముత్తూట్ ఫైనాన్స్ కంపెనీలలో తాకట్టు పెట్టారన్నారు. సమావేశంలో సీఐలు మద్దయ్య ఆచారి, మంజునాథరెడ్డిలతోపాటు ఎస్ఐ మోహన్‌కుమార్, ఎస్ఐ సీఎస్‌కే ప్రసాద్, ఏఎస్ఐ వర్మ పాల్గొన్నారు. కాగా కానిస్టేబుల్ రామకృష్ణ, లక్ష్మీకర్, జనార్ధన్‌లను ఆయన అభినందించారు. నిందితుల నుంచి 229.99 గ్రాముల బంగారు నగలతోపాటు రూ.12వేలు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.



ఉన్నత చదువులకు భరోసా

- జిల్లాలో 34,442 మంది విద్యార్థులకు రూ.24.80 కోట్ల లబ్ధి
- హర్షం వ్యక్తం చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

రాయచోటి : జగనన్న విద్యాదీవెన నిధుల విడుదల తేదీని ప్రభుత్వం ఖరారు చేసింది. మార్చి 1వ తేదీన కృష్ణా జిల్లా పామర్రులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి అకౌంట్లలో నగదు జమ చేయనున్నారు. ఈ పథకం ద్వారా ఉన్నత విద్య చదువుకుంటున్న విద్యార్థులందరికీ ప్రభుత్వం పూర్తి రీయింబర్స్‌మెంటు డబ్బులను చెల్లిస్తోంది. ప్రతి ఏడాది మొత్తం మూడు విడతల్లో ఈ డబ్బును విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రాష్ట్ర ప్రభుత్వం జమ చేస్తోంది. ఈ నగదును తల్లిదండ్రులు నేరుగా వెళ్లి విద్యా సంస్థలలో చెల్లించి అక్కడి పరిస్థితులను తెలుసుకునే అవకాశం ఉంది. ఈ పథకం ద్వారా అన్నమయ్య జిల్లాలో 34,442 విద్యార్థులకు రూ.24.80 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయనుంది. ఈ నిధులు ఏటా క్రమం తప్పకుండా జమ అవుతుండడంతో ఉన్నతాశయంతో చదువుకుంటున్న పేద, మధ్య తరగతి కుటుంబాల విద్యార్థులకు వెన్నుతట్టి ప్రోత్సాహాన్ని ఇస్తున్నట్లు అయింది. అలాగే ఉన్నత చదువులు భారమని భావించిన తల్లిదండ్రులకు కూడా జగనన్న విద్యాదీవెన, వసతిదీవెన ఆర్థికంగా అండగా నిలుస్తోందన్న ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.

చదువుకున్న వారందరికీ..

ప్రతి ఇంటా ఎంతమంది ఉన్నత చదువులు చదువుకున్నా వారందరికీ విద్యా దీవెన పథకం ద్వారా ప్రభుత్వం రీయింబర్స్‌మెంట్ డబ్బులను చెల్లిస్తోంది. జగనన్న విద్యాదీవెన పథకం ద్వారా ఉన్నత విద్య కోర్సులు చదువుకునే విద్యార్థులకు ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు తలెత్తకుండా జగనన్న ప్రభుత్వం ఆర్థిక సాయాన్ని అందిస్తోంది. ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజినీరింగ్, మెడికల్, ఇతర కోర్సులు చదివే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు డబ్బులను వారి తల్లుల ఖాతాల్లో జమ చేస్తోంది.

నియోజకవర్గాల వారీగా జగనన్న విద్యాదీవెన 2023-24..

నియోజకవర్గం	విద్యార్థుల సంఖ్య	విడుదలైన మొత్తం
కోడూరు	4997	రూ.3,79,20,637.
మదనపల్లి	6,432	రూ.4,73,50,309.
పీలేరు:	5,887	రూ.4,02,24,367.
రాజంపేట	4,902	రూ.3,76,62,764.
రాయచోటి	6,882	రూ.4,86,97,921.
తంబళ్లపల్లి	5,342	రూ.3,62,25,200.
మొత్తం	34,442	రూ.24,80,81,198

వసతి దీవెన..

ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో పాటు జగనన్న వసతి దీవెన పథకం ద్వారా కూడా ఆర్థిక సాయాన్ని ప్రభుత్వం అందజేస్తోంది. ఐటీఐ విద్యార్థులకు రూ.10వేలు, పాలిటెక్నిక్ విద్యార్థులకు రూ.15 వేలు, డిగ్రీ, మెడిసిన్ సహా ఇతర ఉన్నత విద్యను చదువుకునే విద్యార్థులకు రూ.20వేల వంతున సాయాన్ని అందిస్తోంది.